క్లుప్తంగా

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో కవులూరు, కొండపల్లికి చెందిన క్రాంతి పాఠశాలల విద్యార్థులు విన్నర్స్ చాంపియన్‌షిప్‌తో పాటు రన్నర్స్ టైటిల్ సాధించారు. విజయవాడ అజిత్ సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో శనివారం జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ఈ ఘనత సాధించారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో జి.కొండూరు, ఇబ్రహీంపట్నం ఎంఈవోలు పజ్జూరి వెంకట నరసింహారావు, సీహెచ్ పుష్పలత, కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీ మోహన్, హెచ్‌ఎం అమ్మాజీ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు.

ఎరువులు కొన్న రైతులకు బిల్లులు ఇవ్వాలి



ముసునూరు: రైతులకు విక్రయించే ఎరువులకు తప్పనిసరిగా బిల్లు ఇచ్చి, సంతకం తీసుకోవాలని ఎరువుల ఇంటర్నల్ ఇన్స్పెక్షన్ అధికారి కేఆర్‌పురం ఏడీఏ పీజీ బుజ్జిబాబు సూచించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం మండల వ్యవసాయాధికారి చిన సూరిబాబు అధ్యక్షతన ఎరువుల దుకాణాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ప్రతి ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను విధిగా ఉంచాలన్నారు. ఎరువుల అమ్మకాలను ఈ పోస్ ద్వారా నిర్వహించాలని, ఎఫ్‌సీఓ 1985 నిబంధనల ప్రకారం విక్రయించాలని, ఎరువుల స్టాక్, నిల్వలు ప్రతి నిత్యం సరి చేసి, రైతుల ముందు ప్రదర్శించాలన్నారు. అనంతరం స్థానిక గోద్రేజ్ ఆగ్రోవిట్ దుకాణంలో ఎరువుల స్టాకును రిజిస్టర్లను, బస్తాల బరువును, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, దుకాణాదారులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. వంతెన మరిచారు

- రెండు కాలనీల మధ్య రాకెట్ సప్లయ్ చానల్
- చానెల్‌కు రెండువైపులా సీసీ రోడ్డు నిర్మించిన నగర పంచాయతీ
- మధ్యలో వంతెన నిర్మించకపోవడంతో సమస్య
- స్కూలుకు వెళ్లేందుకు చిన్నారుల ఇబ్బందులు
- నెరవేరని ఎమ్మెల్యే హామీ

తిరువూరు: పట్టణంలోని తంగిళ్లబీడు కాలనీ నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కాలువపై వంతెన సదుపాయం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 16వ వార్డులోని జగన్నాథపురం కాలనీలో ఎంపీపీ స్కూలుండగా, 30 మంది విద్యార్థులు తంగిళ్ల బీడు నుంచి ఈ పాఠశాలకు వెళ్లాలి. రెండు కాలనీల నడుమ ఉన్న రాకెట్ సప్లయ్ చానల్‌పై వంతెన నిర్మించాలని స్థానికులు దీర్ఘకాలంగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదు.

రెండు కి.మీ చుట్టుతిరిగిరావాల్సిందే..

తంగిళ్ల బీడు నుంచి వెల్లంకి ఎస్టేట్‌మీదుగా జగన్నాథపురం కాలనీలోని ఎంపీపీ స్కూలుకు కేవలం అర కిలోమీటరు దూరం ఉండగా, కాలువపై వంతెన లేకపోవడంతో విద్యార్థులు రెండు కిలోమీటర్లు తిరిగి రావలసి వస్తోంది. రాకెట్ సప్లయ్ చానల్‌కు ఇరువైపులా సీసీ రోడ్డు నిర్మించిన నగర పంచాయతీ కాలువపై వంతెన బాధ్యత తమది కాదంటోంది. కేవలం రూ.20 లక్షలతో ఈ వంతెన నిర్మాణం పూర్తిచేసే అవకాశం ఉన్నా ఇరు శాఖల నడుమ సమన్వయ లోపంతో పని జరగట్లేదు.



తిరువూరులో కాలువపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

నెరవేరని ఎమ్మెల్యే హామీ..

మూడు నెలల క్రితం 16వ వార్డు పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు స్థానికులు రాకెట్ సప్లయ్ చానల్‌పై వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. నగర పంచాయతీ అధికారులు ఇది తమ పరిధిలోకి రాదని తెలపడంతో తానే సొంత నిధులతో వంతెన నిర్మిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఇంతవరకు వంతెన పనులు ప్రారంభం కాలేదని స్థానికులు వాపోతున్నారు.

ఇరిగేషన్ శాఖకు తెలియజేశాం..

స్థానికుల విజ్ఞప్తి మేరకు రాకెట్ సప్లయ్ చానల్‌పై వంతెన నిర్మాణాన్ని గురించి ఇరిగేషన్ అధికారులకు తెలియజేశాం. నగర పంచాయతీ నిధుల నుంచి ఈ వంతెన నిర్మించే అవకాశం లేదు.

– లోవరాజు, నగర పంచాయతీ కమిషనర్, తిరువూరు

బాల్ బ్యాడ్మింటన్‌లో ఎల్‌బీఆర్‌సీఈ ప్రతిభ

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జేఎన్‌టీయూసీకే కాకినాడ సెంట్రల్ జోన్ బాల్‌బ్యాడ్మింటన్ మెన్ అండ్ విమెన్ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ 2024– 25లో పురుషుల విభాగంలో రన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. ఈ నెల 2న పీఏసీఈ ఇంజినీరింగ్ కళాశాల, ఒంగోలులో జరిగిన ఈ పోటీలలో తమ కళాశాలకు చెందిన ఎస్కే ఖాజా మోయినుద్దీన్, ఎస్కే జానీ భాషా, బాలికల విభాగంలో పావని ఈ నెల బెంగళూరు నార్త్ యూనివర్శిటీలో జరగనున్న సౌత్ జోన్ ఆల్ ఇండియా బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కి జేఎన్‌టీయూకే బాల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన చైతన్య స్కూల్ పీఈటీ సాయి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.వీ రాజకుమార్‌ను కళాశాల హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, ప్రెసిడెంట్ జీ శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



జేఎన్‌టీయూకే బాల్ బ్యాడ్మింటన్ టీమ్‌తో జయప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసాలు

తిరువూరు: వసంత పంచమి సందర్భంగా తిరువూరు రాజుపేటలోని అష్టలక్ష్మీ దేవాలయంలో సోమవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. వసంత పంచమి విశిష్టతను పద్మనాభశాస్త్రి వివరించారు.

మైలవరం: మైలవరంలోని శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో వసంత పంచమి మాఘ శుక్ల తిథియ పురస్కరించుకుని సోమవారం సరస్వతీ దేవికి పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చదువులో బాగా రాణించాలని అమ్మవారిని ఆరాధించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జంగుసం రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో..

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక...

నెగ్గిన ప్రలోబాల పర్వం

నూజివీడు: ప్రలోబాల రాజకీయం నెగ్గింది. మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని టీడీపీ కైవసం చేసుకుంది. 32 మంది కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో వైస్ చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశానికి 31 మంది కౌన్సిలర్లు హాజరవగా 18వ వార్డు కౌన్సిలర్ తవిడశెట్టి వెంకటలక్ష్మి గైర్హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ తరఫున 32వ వార్డు కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు, టీడీపీ తరఫున 5వ వార్డు కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ పేర్లను ఆయా పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ప్రతిపాదించగా పలువురు కౌన్సిలర్లు బలపరిచారు. ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అయిన బచ్చు స్మరణ్‌రాజ్ చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 14 మంది, టీడీపీ అభ్యర్థికి మంత్రి కొలుసు పార్థసారధితో కలిపి 18 మంది మద్దతు పలికారు. పగడాల సత్యనారాయణ వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు సబ్‌కలెక్టర్ ప్రకటించారు. అనంతరం పగడాల సత్యనాన్నారాయణకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరైన కౌన్సిలర్లు

అడుగడుగునా ప్రలోభాలే..

మొత్తం 32 మంది కౌన్సిలర్లు ఉన్న నూజివీడు మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీకి, 8 మంది కౌన్సిలర్లు టీడీపీకి ఉన్నారు. ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు ఏడాది క్రితం అప్పటి వరకు వైస్ చైర్మన్‌గా ఉన్న పగడాల సత్యనారాయణ పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత జనరల్ ఎలక్షన్స్ రావడం, ప్రభుత్వం మారడం తదితర కారణాలతో ఖాళీ ఏర్పడిన వైస్ చైర్మన్ పదవి భర్తీకి ఎన్నిక నిర్వహించడంలో జాప్యం చోటు చేసుకుంది. ఈ పరిస్థితుల్లో గత నెల 27 రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రలోభాలు సాగించారు. సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించి వైఎస్సార్ సీపీకి చెందిన 9 మంది కౌన్సిలర్లను టీడీపీలోకి లాక్కొని వైస్ చైర్మన్ పదవిని చేజిక్కించుకున్నారు. వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు. డీఎస్పీ కేవీవీ ఎన్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో పట్టణ, రూరల్ సీఐలు పి.సత్యశ్రీనివాస్, కె.రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

నూజివీడు: రబీ పంటల సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు గడించొచ్చని ఏరువాక శాస్త్రవేత్త ఫణికుమార్ పేర్కొన్నారు. గొల్లపల్లిలో సోమవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రబీలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తన ఉత్పత్తిపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఫణికుమార్ మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెపురుగు నివారణ, బ్యాక్టీరియా స్టాక్‌రాట్, ఎండు తెగులు నివారణకు రైతులు పాటించాల్సిన చర్యలను తెలిపారు. బాక్టీరియా స్టాక్‌రాట్ నివారణకు ఎకరాకు నాలుగు కిలోల బ్లీచింగ్ పౌడర్‌ను వాడాలని, ఎండు తెగులు నివారణకు ఎకరాకు ట్రైకోడెర్మా విరిడి ఒక కిలో చొప్పున పశువుల ఎరువు, వేపపిండితో కలిపి కల్చర్ త యారు చేసి పొలం అంతా చల్లాలన్నారు. తెల్ల దోమ నివారణకు సర్ఫ్ ద్రావణం ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ మాట్లాడుతూ జాతీయ తెగులు పర్యవేక్షణ యాప్‌ను రైతులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విజయరాయి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రమణ మాట్లాడుతూ విత్తనోత్పత్తి చేసే రైతులు కంపెనీని బట్టి ఆడ, మగ వరుసలు సరైన నిష్పత్తిలో ఉండాలన్నారు. వ్యవసాయాధికారిణి ఆలూరు చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఫణికుమార్

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తిరువూరు: జాతీయ స్థాయి షోటోకాన్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరువూరు సిద్ధార్థ స్కూలు విద్యార్థులు పలు పతకాలు సాధించారు. కాటా విభాగంలో రెండో తరగతి విద్యార్థిని ఆచంటి దూహిత, నాలుగో తరగతి విద్యార్థిని షేక్ తంజీలామన్స, ఐదో తరగతి చదువుతున్న పామర్తి షరిష్ణ, ఒకటో తరగతి విద్యార్థిని పామర్తి యషిక, జోరిగా చిహ్నిత, లకావత్ మధుప్రియలు ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. గుట్ల స్వాని, శశి, అభిలాష ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కోరం లేక సమావేశం వాయిదా

విస్సన్నపేట: విస్సన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం కోరం లేని కారణంగా వాయిదా పడింది. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. మండలంలో 17 ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ఎవరూ సమావేశానికి రాలేదని ఎంపీడీఓ చిన రాట్నాలు తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు జరిగేది తెలియజేస్తామన్నారు.

అనారోగ్యంతో వైద్య ఉద్యోగి మృతి



నవ్య (ఫైల్)

తిరువూరు: గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌గా విధులు నిర్వహిస్తున్న నవ్య (23) అనారోగ్యంతో మృతి చెందారు. పెనుగంచిప్రోలు మండలం సుబ్బయ్యగూడెం గ్రామానికి చెందిన ఆమె గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారు ఝామున ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు అవివాహిత.

ద్విచక్రవాహనం బాక్సులోని నగదు చోరీ

తిరువూరు: తిరువూరులో పట్టపగలు ద్విచక్రవాహనంలో నగదును ఒక ఆగంతకుడు చోరీ చేశాడు. సూరవరానికి చెందిన కృష్ణయ్య..యూనియన్ బ్యాంకులో రూ.75 వేల నగదు డ్రాచేసి తన మోపెడ్ బాక్సులో ఉంచారు. మధిర రోడ్డు సెంటర్లో ద్విచక్రవాహనం ఆపి ఒక దుకాణంలోకి వెళ్లి తిరిగి వచ్చాడు. కృష్ణయ్య తన వాహనం బాక్సులో నగదు చోరీ అయినట్లు గుర్తించాడు. చోరీ చేసిన వ్యక్తి మరో ద్విచక్రవాహనంపై పారిపోయాడు. సీసీ కెమెరాలో చోరీ సంఘటనను పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

చాట్రాయి: మండలంలోని చనుబండలో వేంచేసియున్న శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్వామి వారిని శ్రీకోదండ రామాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పూజలు చేసి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు జల్లేపల్లి సుబ్బారావు, పరమేశ్వరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం

చాట్రాయి: ఎస్సీ వర్గీకరణ కోసం ఎటువంటి పోరాటాలకైనా సిద్ధమని ఏలూరు జిల్లా ఎమ్మార్పీఎస్ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు కంకట వెంకటేశ్వరావు మాదిగ అన్నారు. సోమవారం మండలంలోని చాట్రాయి దళితవాడల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మందపాటి బసవారెడ్డి, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మొలుగుమాటి రఘురాం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగు



చాట్రాయి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలో ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు, రాజకీయ ఫ్లెక్సీలను తొలగించారు.



పెద్ద శేష వాహనంపై శోభనాచలుడు



పెద్ద శేష వాహనంపై శ్రీవారికి గ్రామోత్సవం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు పెద్ద శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పది గంటలకు స్వామివారి శాంతి కల్యాణాన్ని మంచిర్యాలకు చెందిన శ్రీకాళహస్తి రాజరాజేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు కాపు సంఘం ఆధ్వర్యంలో స్వామిని పెళ్లి కుమారుడిగా అలంకరించి పెద్ద శేష వాహనంపై గ్రామోత్సవం జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆగిరిపల్లికి చెందిన సగ్గుర్తి రామారావు ఆధ్వర్యంలో విద్యుత్ కాంతులతో స్వామివారి ఆలయాలను సుందరంగా అలంకరించారు.



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న శోభనాచలుని ఆలయం



రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి మాఘమాస రథ సప్తమి ఉత్సవాల సందర్భంగా స్వామివారి దివ్య రథానికి వంశపారంపర్య ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి రథశాల నుంచి స్వామివారి కల్యాణ మండపానికి తరలించారు. రథోత్సవంలో తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ శుభశేఖర్, ఆగిరిపల్లి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఈదులగూడెం మాజీ సర్పంచ్ ఈలప్రోలు సుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యులు సాదం గోపి, చిమట శ్రీనివాసరావు, వాక సక్కేశ్వరరావు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణ మండపానికి రథాన్ని తరలిస్తున్న ఆలయ ధర్మకర్త ప్రతాప్ అప్పారావు, భక్తులు







